క్లుప్తంగా

శిష్టకరణాల సమస్యలు గుర్తించాం



సోము వీర్రాజుకు వినతిపత్రం అందజేస్తున్న శిష్టకరణ సంఘం నాయకులు

దాబాగార్డెన్స్: ఓబీసీ సాధనకు, శిష్టకరణాల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలను తానెప్పుడో గుర్తించానని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు పేర్కొన్నారు. త్వరలో ఓబీసీ చైర్మన్ రాష్ట్రాన్ని సందర్శించనున్న సందర్భంలో ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని శిష్టకరణ సంఘ నాయకులకు ఆయన హామీ ఇచ్చారు. సోము వీర్రాజును శిష్టకరణ సంఘం నాయకులు ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి. ఉమామహేశ్వరరావు, యువజన సంఘం రాష్ట్ర నాయకుడు నన్‌మూర్తి, కె. పావని, గంగుల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి చక్కటి స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

సీతంపేట: శ్రీ యశోద కృష్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో అమెరికన్ ఆసుపత్రి సహకారంతో సీతంపేట దుర్గాగణపతి ఆలయం వద్ద ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ముఖ్య అతిథిగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్డియాలజిస్ట్ బి.శ్రీకాంత్, ఫిజీషియన్లు జాన్ సూరజ్, సుగుణ, అంకాలజిస్ట్ రవీంద్రకుమార్, పీడియాట్రిషన్ సంతోష్, సంఘం సభ్యులు ముద్దాడ ఎల్లాజీ, బీసవు శ్రీను, పిల్లా మోహన్, పల్లా పాపారావు, నాయుడు మాస్టర్, జోగ శ్రీను, ముద్దాడ శంకర్, పల్లా రాము, ఒమ్మి చిన్న, ఉప్పిలి అప్పన్న పల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణ పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణమండపంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి నిర్వహించి విశేషంగా హారతులు ఇచ్చారు.

ఘనంగా ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు



నేరెళ్ల కోనేరు జంక్షన్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద పుస్తకావిష్కరణ చేస్తున్న అభిమానులు

అల్లిపురం: ఎన్టీఆర్ శత జయంతి వేడుకలను 32వ వార్డు ఎన్టీఆర్ అభిమానులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. నేరెళ్లకోనేరు జంక్షన్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఎన్టీఆర్ నట విశ్వరూపం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారన్నారు. ఈ కార్యక్రమంలో మంగ శంకర్రావు, వంపాన రాజ్యలక్ష్మి, కనకమహాలక్ష్మి, ఎస్ఎస్వీ ప్రసాద్, ధర్మేష్, తిలక్, సత్యనారాయణ, అప్పలరాజు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అంతా అక్కడికే..

- మెటల్ స్టోర్స్‌కు కేరాఫ్ అల్లిపురం
- హోల్‌సేల్, రిటైల్ దుకాణాలకు నెలవు
- దశాబ్దాలుగా స్టీల్, ఇత్తడి, అల్యూమినియం సామగ్రి వ్యాపారానికి కేంద్రం



జ్యోతి థియేటర్ రోడ్డులో గల రెడ్డి సన్స్ మెటల్ స్టోర్స్



దుకాణంలో గల స్టీల్ సామగ్రి

అల్లిపురం: జిల్లాలో మెటల్ స్టోర్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా అల్లిపురం వెలుగొందుతోంది. దశాబ్దాలుగా ఇక్కడ స్టీల్, ఇత్తడి, అల్యూమినియం, రాగి వస్తువుల అమ్మకాలు జరుపుతున్న దుకాణాలు 50 వరకు ఉన్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లా నలుమూలల నుంచి తమ శుభ, అశుభ కార్యాలకు స్టీలు, ఇత్తడి, రాగి సామగ్రి కొనుగోలు చేసేందుకు ప్రజలు వస్తుంటారు. రోజుకు సుమారు 30 నుంచి 40 లక్షల వరకు వ్యాపారం జరుగుతుందంటే ఈ ప్రాంతం ఎంత ప్రసిద్ధి చెందిందో తెలుస్తుంది. అల్లిపురం మెయిన్ రోడ్డు, బంగారుమెట్ట, నారాయణవీధి, దాబాగార్డెన్స్, కెప్టెన్ రామారావు జంక్షన్, యాతపేట, జ్యోతి థియేటర్ రోడ్డు, సరస్వతీ పార్కు రోడ్డుతో పాటు కమిషనరేట్ రోడ్డు, పూర్ణామార్కెట్ ప్రాంతాల్లో అధికంగా మెటల్ స్టోర్స్ ఉన్నాయి. గత రెండు దశాబ్దాలుగా ప్లాస్టిక్ వాడకం పెరగటంతో ప్లాస్టిక్ సామాన్లు కూడా హోల్‌సేల్‌గా అమ్ముతున్నారు. ఈ రంగంలో ప్రత్యక్షంగా వెయ్యి మంది వరకు ఉపాధి పొందుతుంటే, పరోక్షంగా మరో 2 నుంచి 3 వేల మంది ఉపాధి పొందుతున్నారు.

దసరా సమయంలో సందడి..

దసరా సమయంలో ఈ ప్రాంతంలో సందడి నెలకొంటుంది. దసరా చీటీలు నగరంలో చాలా చోట్ల ప్రజలు వేస్తుంటారు. దసరా సమయంలో రాగి, ఇత్తడి బిందెలు, అండాలు, డేగిసాలు చీటీలు కట్టిన వారికి ఇస్తుంటారు. వాటి కొనుగోలుకు ఈ ప్రాంతంలో దుకాణాలకు జిల్లాలో పలు ప్రాంతాల నుంచి వస్తుంటారు. ఆ సమయంలో అల్లిపురంతో పాటు పూర్ణామార్కెట్, దాబాగార్డెన్స్ ప్రాంతాల్లో దుకాణాల వద్ద కొనుగోలుదారులతో సందడిగా మారుతుంది.

గత రెండేళ్లుగా వ్యాపారాలు లేవు

గత రెండేళ్లుగా వ్యాపారాలు లేవు. కరోనా వలన వ్యాపారాలు తగ్గిపోయాయి. గతంలో పెళ్లిళ్ల సీజన్‌లో వ్యాపారాలు బాగుండేవి. ప్రస్తుతం సాలె సామానులు తగ్గిపోవడంతో సీజన్ అయినా వ్యాపారాలు లేవు.

–సంజయ్‌జైన్, గణేష్ మెటల్ స్టోర్స్, దాబాగార్డెన్స్.

మా దగ్గర అన్నీ దొరుకుతాయి



గత ఏడాది కాలంగా వ్యాపారాలు బాగున్నాయి. గతంలో కంటే వ్యాపారం తగ్గినట్లే. ఇప్పుడిప్పుడే వ్యాపారం అభివద్ధి చెందుతుంది. ఈ ప్రాంతంలో దొరకని వస్తువంటూ ఉండదు. చిన్న వస్తువుల నుంచి హోటల్ ఇండస్ట్రీకి కావాల్సిన అన్ని రకాల వస్తువులు ఇక్కడ దొరుకుతాయి. పాత సామాన్ల ఎక్సేంజి సౌకర్యం కూడా ఉంది.

–కనకరెడ్డి, రెడ్డిసన్స్, అల్లిపురం

తూర్పు కాపు నూతన జేఏసీ ఏర్పాటు



సంఘీభావం తెలుపుతున్న తూర్పు కాపు జేఏసీ నాయకులు

సీతమ్మధార : తూర్పు కాపు కులాన్ని చిన్నచూపు చూస్తున్న రాజకీయ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పి తీరుతామని ఆలిండియా తూర్పు కాపు సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ హెచ్చరించారు. అశీలమెట్టలో జరిగిన రాష్ట్ర తూర్పు కాపు జాయింట్ యాక్షన్ కమిటీ ఆవిర్భావ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేళ్లుగా తూర్పు కాపు రిజర్వేషన్ల సాధనకు పలుమార్లు ప్రభుత్వాలకు మొరపెట్టుకున్నా నేటికీ పరిష్కారం కాకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో 36 మందితో తూర్పు కాపు జేఏసీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర జేఏసీ చైర్మన్‌గా గిరగా అప్పలస్వామి, కో చైర్మన్‌గా అన్నెపు రామకృష్ణనాయుడు, గౌరవ చైర్మన్‌గా పైలా శ్రీనివాసరావు, వర్కింగ్ చైర్మన్లుగా బబ్బాది ఫకీర్‌నాయుడు, పతివాడ కృష్ణవేణి, చీఫ్ సెక్రటరీలుగా రాయి శ్రీనుబాబు, ఈ.శ్రీనివాసరావు, కె.అచ్చెంనాయుడు, ఎం.గురునాయుడు, కోశాధికారిగా బెల్లాన సంతోష్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల అప్పల సూరినాయుడు, ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్విని, యువజన విభాగం రాష్ట్ర సహాధ్యక్షుడు శ్రీనుబాబు, రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు ఖైవతి జయలక్ష్మి, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దింటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిరంతర వైద్య విద్యతో చక్కటి నైపుణ్యం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట : నిరంతర వైద్య విద్యా కార్యక్రమాలను తరచూ నిర్వహించడం ద్వారా ఆధునిక పద్ధతులు తెలుసుకోవడానికి వీలు కలుగుతుందని ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు. కేజీహెచ్ ప్రసూతి విభాగం, వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ సంయుక్త నిర్వహణలో ఆదివారం నిరంతర వైద్య విద్యా కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ బుచ్చిరాజు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ప్రసూతి వైద్యంలో అధునాతన పద్ధతులు వస్తున్నాయని, వాటిపై ప్రతి ప్రసూతి పీజీకి అవగాహన ఉండాలని ఆయన అన్నారు. కేజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ మాట్లాడుతూ శాఖల వారీగా సీఎంఈ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రసూతి వైద్యానికి చెందిన పలు అంశాలపై జరిగిన చర్చాగోష్ఠిలో ప్రొఫెసర్లు కేవీఎస్ సంధ్యాదేవి, డాక్టర్ ఆర్.గీతావందన, డాక్టర్ అల్లు పద్మజ, డాక్టర్ కె.శ్యామలాదేవి, డాక్టర్ జి.రాజ్యలక్ష్మి, డాక్టర్ వాణి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

మరో రామజోగిపేట కాకూడదు..



కూలేందుకు సిద్ధంగా ఉన్న ఇల్లు



చెట్టు వేర్లు ఇంటిని తాకుతున్న దృశ్యం

- లలితానగర్‌లో భయపెడుతున్న పాడుబడ్డ ఇల్లు
- ఇంటిని తాకుతున్న చెట్టు వేర్లు
- కూల్చేయాలంటున్న స్థానికులు

దాబాగార్డెన్స్: ఆరు నెలల కిందట 30వ వార్డు పరిధి కోడివంద్యాల వీధిలో ఓ ఇంటి ప్రహరీ కూలి ఓ వ్యక్తి మంచం పట్టాడు. నాలుగు నెలల కిందట 36వ వార్డు పరిధి బాబాజీకొండపై ఉన్నట్టుండి ఓ ఇల్లు నేలకొరిగింది. ఈ ఘటనలో ఓ పెద్దాయన ఆసుపత్రి పాలయ్యాడు. రెండు నెలల కిందట జీవీఎంసీ పరిధి 29వ వార్డు రామజోగిపేటలో ఓ ఇల్లు కూలింది. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు. ఇలా పలువురు పలు ప్రాంతాల్లో జరిగిన ఘటనల్లో ప్రమాదాలకు గురయ్యారు. రానున్నది వర్షాకాలం. పాతనగరంలో ఎన్నో పాడుబడ్డ భవనాలున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో తెలియదు. ఈ నేపథ్యంలో పాత ఇళ్లు, భవనాల్లో నివసిస్తున్న వారు బిక్కుబిక్కుమంటున్నారు.

జీవీఎంసీ నోటీసులు జారీ చేసినా..

పాతనగరంలో శిథిలావస్థకు చేరుకున్న పలు పాత భవనాలకు జీవీఎంసీ నోటీసులు జారీ చేసింది. నోటీసులు అందుకున్న వారిలో కొందరు ముందుకొచ్చి పాత భవనాలు నేలమట్టం చేసుకున్నారు. మరికొంత మంది యజమానులు స్పందించకుండా భీష్మించుకున్నారు. ఇదిలా ఉండగా నగరంలోని 31వ వార్డు పరిధి దాబాగార్డెన్స్ లలితాకాలనీలో ఓ ఇల్లు శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడైనా కూలేందుకు సిద్ధంగా ఉంది. ఇప్పటికే ఆ ఇంటి శ్లాబ్‌ల పెచ్చులూడుతున్నాయి. ప్రహరీలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఆ ఇంటి వెనకాల గల చెట్టు వేర్లు ఇంటిని తాకాయి. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోననే భయం గుప్పిట్లో పరిసర ప్రాంతాల వారున్నారు. ఈ ఇంటికి సంబంధించి ఇద్దరు లీగల్ హెయిర్స్ ఉన్నారు. వీరిద్దరిలో ఒకరు ఆ ఇంటిని నేలమట్టం చేయించేందుకు ముందుకొచ్చారు. మరో యజమాని ముందుకు రాకపోవడంతో ఆ ఇంటికి ఆనుకుని ఉన్నవారు ఆవేదనలో ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరో రామజోగిపేట ఘటన విశాఖలో జరగకుండా చూస్తారని పరిసర ప్రాంతాల వారు జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బందిని వేడుకుంటున్నారు.

నీలమ్మ వేపచెట్టు అమ్మవారి సన్నిధిలో ఎంఎల్‌సీ వంశీకృష్ణ



నీలమ్మ వేపచెట్టు అమ్మవారి సన్నిధిలో వంశీకృష్ణ యాదవ్ తదితరులు

అల్లిపురం: అస్సాంగార్డెన్స్‌లో గల నీలమ్మ వేపచెట్టు అమ్మవారిని వైఎస్సార్‌సీపీ ఎంఎల్‌సీ వంశీకృష్ణ శ్రీనివాస్‌తో పాటు సినీ నిర్మాత సిద్ధారెడ్డి, హీరో ఇంద్రసేన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మి, శ్రీనివాసరెడ్డి దంపతులు వారికి ప్రత్యేకంగా ఆహ్వానం పలికారు. అనంతరం అమ్మవారికి వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి అమ్మవారి శేష వస్త్రంతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం వంశీకృష్ణ యాదవ్ తదితరులు బొర్రా విజయలక్ష్మి శారదాపీఠం చిన్న స్వామీజీ, వనస్థలిపురం మౌలానా బాబాజీ, సింధూ మాతాజీ చేతుల మీదుగా బెస్ట్ పొలిటీషియన్ అవార్డు అందుకున్నందుకు అభినందించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ బొర్రా శ్రీనివాసరెడ్డి, బడుగు శ్రీనివాస్, పీలా మహేష్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పలువురికి ఎన్టీఆర్ పురస్కారాలు



నాటక రంగ ప్రముఖుడు వర్రే నాంచారయ్యను సత్కరిస్తున్న నిర్వాహకులు

దాబాగార్డెన్స్: సనరా–చందు ఆర్ట్స్ మూవీస్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు ఆదివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశేష సేవలందించిన పలువురు ప్రముఖులను ఎన్టీఆర్ పురస్కారాలతో సత్కరించారు. నిర్వాహకులు సనరా వంశీ, చంద్రశేఖర్ మాట్లాడుతూ ఒక మంచి లక్ష్యంతో సమాజంలో వివిధ రంగాల్లో నిష్ణాతులైన ప్రముఖులను సత్కరించామన్నారు. కార్యక్రమంలో వీరభద్రరావు, తోట ముకుంద్, నాగరాజు పట్నాయక్, సీనియర్ పాత్రికేయులు మణిశర్మ, ఆదారి కొండలరావు, నాటక గ్రంథాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు బాదంగీర్‌సాయి, నాటక రంగ ప్రముఖులు దాలినాయుడు, బొబ్బాది అప్పారావు, పి. శివప్రసాద్, నవరస మూర్తి, వర్రే నాంచారయ్య, పొందూరు అర్జున్, గాయకుడు గడసావు శ్రీను, వెలగాడ జ్యోతి, కృష్ణప్రియ, నేమాని హేమసుందర్, రామకృష్ణ మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఘంటసాల నాటకం



ఘంటసాల నాటకంలో ఓ సన్నివేశం

మద్దిలపాలెం: అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జీవితంలో ముఖ్య ఘట్టాలతో రూపొందించిన నాటకాన్ని కళాకారులు కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. రంగసాయి నాటక సంఘం వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయి ఆధ్వర్యంలో ఆదివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఈ నాటక ప్రదర్శనను మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, నురపనేని విజయకుమార్, ఏయూ పూర్వ రిజిస్ట్రార్ వెలగపూడి ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. స్నేహషుమృశ్రీకు చెందిన శ్రీసాయి సంతోషి నాట్య మండలి, సురభి కళాకారులు ప్రదర్శించిన ఈ నాటకంలో ప్రధానంగా ఘంటసాల వెంకటేశ్వరరావు తొలినాళ్లలో సంగీతం నేర్చుకునే క్రమంలో పడిన కష్టాలను చూపించారు. అనంతరం విజయనగరం సంగీత కళాశాలకు చేరిన తీరుతో పాటు ఆయన వివాహం గురించి చక్కగా సన్నివేశాలు రూపొందించారు. అనంతరం మద్రాసు వెళ్లిన ఘంటసాల అక్కడ సంగీత దర్శకుడిగా, గాయకుడిగా ఎదిగిన తీరును నాటకంలో చూపించిన తీరు అద్భుతం. అదే క్రమంలో క్విట్ ఇండియా ఉద్యమంలో ఘంటసాల పాల్గొని జైలుపాలు అయ్యే సన్నివేశాన్ని కూడా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. తర్వాత మద్రాసులో పొట్టి శ్రీరాములు ఆమరణ దీక్ష చేస్తూ చనిపోయిన సన్నివేశంలో ఘంటసాల ప్రత్యేక ఆంధ్ర ఉద్యమంలో భాగస్వాములు ఎలా అయ్యారో కథలో సమేకం చేశారు. అనంతరం ఓ చిత్రంలో హార్మోనియం వాయించే సీన్ కోసం ఎన్టీఆర్.. ఘంటసాల ఇంటికి వెళ్లి హార్మోనియం నేర్చుకున్న సన్నివేశాన్ని చక్కటి పాటతో మేళవించి ప్రదర్శించారు.

ప్రత్యేక ఆకర్షణగా బాలనటులు

నాటకంలో బాల నటీనటులు లవకుశలో పాటలను ఆలపించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సురభి చిన్నారులు హిమంను సంతోషి, జాహ్నవిలను ప్రేక్షకులు అభినందించారు.

విద్యార్థులకు కరాటేలో శిక్షణ



కరాటే, కిక్ బాక్సింగ్‌లో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు

అల్లిపురం: జీవీఎంసీ వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు కరాటే గ్రాండ్ మాస్టర్ కె.సుమన్ శిక్షణ ఇస్తున్నారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ గ్రౌండ్‌లో ప్రతి రోజు ఉదయం విద్యార్థులకు ఆయన వద్దాది లక్ష్మీపతి పర్యవేక్షణలో శిక్షణ అందజేస్తున్నారు. అదే విధంగా కిక్ బాక్సింగ్‌లో గ్రాండ్ మాస్టర్ జి.ఆనంద్‌బాలు, వద్దాది సురేష్ గత 20 రోజులుగా శిక్షణ అందజేస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తాము నేర్చుకున్న కరాటే, కిక్ బాక్సింగ్ కళలను ఆత్మరక్షణ, స్వీయ రక్షణకు మాత్రమే వినియోగించాలని, దుర్వినియోగం చేయరాదని శిక్షకులు సూచించారు. ఆదివారం ప్రత్యేకంగా నిర్వహించిన తరగతుల్లో గత 20 రోజుల్లో విద్యార్థులు నేర్చుకున్న విద్యను ప్రదర్శించేలా ప్రోత్సహించారు. క్రీడలతో పాటు విద్యార్థులకు పౌష్టికాహారం, పాలు, గుడ్లు, పండ్లను దాతలు సీహెచ్ శ్రీనివాసరావు, సంఘంరెడ్డి మల్లేశ్వరరావు, నూరాడ గౌరీశంకర్, కనకమహాలక్ష్మి దేవస్థానం ఉద్యోగుల సహకారంతో అందజేస్తున్నట్లు తెలిపారు.

'నాడు నేడు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

సీతంపేట: డాక్టర్ నండూరి రామకృష్ణ రచించిన 'నాడు నేడు' పుస్తకావిష్కరణ సభ స్థానిక పౌరగ్రంథాలయంలో జరిగింది. కళావేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలోమాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో రచయితల పాత్ర గొప్పదని ప్రశంసించారు. సాహిత్యం సమాజానికి ప్రతిబింబం కావాలన్నారు. 1947 నుంచి 2022 వరకు సాహిత్య, కళా రంగాలకు నండూరి చేసిన సేవలను పుస్తకంలో అద్భుతంగా పొందుపర్చారన్నారు. కవితల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. డి.వి.సూర్యారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆచార్య కె.మలయవాసిని, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ పంపిణీ చేస్తున్న డాక్టర్ వెంకటరమణమూర్తి

మురళీనగర్: వేసవి వేడిమి నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు మానవసేవే మాధవ సేవ అసోసియేషన్ ఆధ్వర్యంలో మురళీనగర్‌లో ఆదివారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ పి.వెంకటరమణమూర్తి ప్రారంభించారు. బాటసారులు, కార్మికులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్, ఉపాధ్యక్షుడు ఎం.కోదండం, కార్యదర్శి ఎస్.సీతారామకృష్ణ, కోశాధికారి కేవీ వర్మ, సంయుక్త కార్యదర్శి పి.సంతోష్ కుమార్, నిర్వహణ కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు, ఉప కోశాధికారి పి.వెంకటరావు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొని సహకరించారు.

పాలిటెక్నిక్ ప్రవేశాలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి కౌన్సెలింగ్



పాలిటెక్నిక్ విద్యార్థులు

మురళీనగర్: పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి సర్వం సిద్ధంగా ఉన్నట్లు కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు తెలిపారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే కౌన్సెలింగులో భాగంగా విద్యార్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి సిబ్బందిని నియమించినట్లు చెప్పారు.

ఇవి తీసుకురావాలి

సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ప్రాసెసింగ్ ఫీజు రసీదుతో పాటు పాలిసెట్ హాల్ టికెట్, ర్యాంకు కార్డు, ఎస్ఎస్‌సీ మార్కుల మెమో (ఒరిజినల్ లేదా ఇంటర్‌నెట్ కాపీ), 4–10 తరగతుల వరకు స్టడీ సర్టిఫికెట్ లేదా రెసిడెన్స్ సర్టిఫికెట్, ఈడబ్ల్యుఎస్ సర్టిఫికెట్ (ఓసీ అభ్యర్థులకు), 01.01.2020 నాడు లేదా తర్వాత జారీ చేసిన ఆదాయ ధ్రువపత్రం, కులధృవీకరణ పత్రం, టీసీ, ప్రత్యేక కేటగిరీ విద్యార్థులు వారికి సంబంధించిన సర్టిఫికెట్లు తీసుకు రావాల్సి ఉంటుంది.

ర్యాంకులవారీగా కౌన్సెలింగ్ వివరాలు:

కేంద్రం మే29 మే30 మే31 జూన్1 జూన్2 జూన్3 జూన్4 జూన్5

కెమికల్ ఇంజినీరింగు కాలేజీ, కంచరపాలెం

1నుంచి 6000 12001 నుంచి 19500 27001 నుంచి 35000 43001 నుంచి 51000 59001 నుంచి 67000 75001 నుంచి 83500 92001 నుంచి 100000 108001 నుంచి 116000

పాలిటెక్నిక్ కాలేజీ, కంచర పాలెం

6001 నుంచి 12000 19501 నుంచి 27000 35001 నుంచి 43000 51001 నుంచి 59000 67001 నుంచి 75000 83501 నుంచి 92000 100001 నుంచి 108000 116001 నుంచి చివరి ర్యాంకు

పాలిటెక్నిక్ కాలేజీ, పెందుర్తి

1 నుంచి 12000 12001 నుంచి 27000 27001 నుంచి 43000 43001 నుంచి 59000 59001 నుంచి 75000 75001 నుంచి 92000 92001 నుంచి 108000 108001 నుంచి చివరి ర్యాంకు

ఎస్టీ విద్యార్థులు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు వెళ్లాల్సి ఉంటుంది. స్పెషల్ కేటగిరీ విద్యార్థులు జూన్ 2 నుంచి 5 వరకు విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో సర్టిఫికెట్లు పరిశీలన చేయించుకోవాలి.

ఆకట్టుకుంటున్న సాయిబాబా విగ్రహం



చినగదిలి ఆలయంలో ఏర్పాటు చేసిన ఊపిరి పీల్చే సాయిబాబా విగ్రహం

ఆరిలోవ: చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో మరో సాయిబాబా విగ్రహాన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. ఊపిరి పీల్చి వదులుతున్నట్లు ఉన్న ఈ విగ్రహాన్ని రవిచంద్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో తయారు చేశారు. దీన్ని ఆదివారం ఇక్కడి ఆలయంలో భక్తుల దర్శనం కోసం ఉంచారు. ఊపిరి పీల్చి, వదలడమే కాకుండా ఏడమ చేతి మధ్య వేలు కదపడం, నవ్వుతున్నట్టు ఉన్న ఈ సాయిబాబా విగ్రహం భక్తులను ఆకట్టుకుంటోంది. నాలుగు నెలల క్రితం కూడా రవిచంద్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో మాట్లాడే షిర్డీ సాయిబాబా విగ్రహాన్ని ఇక్కడ ఏర్పాటు చేసి కొద్ది రోజుల అనంతరం దాన్ని చింతపల్లికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఏర్పాటు చేసిన విగ్రహాన్ని నెల రోజుల పాటు ఇక్కడ సందర్శకుల కోసం ఉంచనున్నట్లు రవిచంద్ ఆర్ట్స్ నిర్వాహకుడు రవిచంద్ తెలిపారు. సుమారు ఐదున్నర అడుగుల ఎత్తు ఉండే ఈ విగ్రహాన్ని రూ.8 లక్షల ఖర్చుతో మూడు నెలల పాటు శ్రమించి తయారు చేసినట్లు తెలిపారు.